నిపుణుల బృందాన్ని అడ్డుకున్న పెదకోట గిరిజనులు

ప్రజాశక్తి-అనంతగిరి : మండలంలోని పెదకోటలో హైడ్రో పవర్ ప్రాజెక్టు ఏర్పాటుపై సర్వే చేయడానికి జార్ఖండ్ నుంచి బుధవారం వచ్చిన ఇంజనీర్ల బృందాన్ని గిరిజనులు వెనక్కు పంపించారు. అరకు ఎమ్మెల్యే శెట్టి ఫల్గుణ, ఎంపీ మాధవి జోక్యం చేసుకొని గిరిజన గ్రామాలు, భూములు, జలసమాధి కాకుండా చూడాలని హైడ్రో పవర్ ప్రాజెక్టు పోరాట కమిటీ నాయకులు నారంగి సింహాచలం, జన్ని ఈశ్వరరావు డిమాండ్ చేశారు. సర్వేలపై వారిద్దరూ నోరువిప్పి గిరిజన పక్షం వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో కురిశాల ఈశ్వరరావు, గొల్లోరి ఆనంద్, కోనేపు పావణి, సివేరి లక్ష్మి,మాదల ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

పర్యటిస్తున్న బంధం సభ్యులు

పాడేరు ఐటిడిఎ పిఒను ..

సరెండర్ చేసే వరకూ ఉద్యమం ఆగదు

▶▶ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.సురేంద్ర ▶▶ ఐటిడిఎ వద్ద మహా ధర్నా విజయవంతం

ప్రజాశక్తి-పాడేరు:గిరిజనుల పట్ల గిరిజన ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు పట్ల గౌరవం లేని పాడేరు ఐటీడీఏ పిఒ ను తక్షణమే సరెండర్ చేసేంత వరకు ఉద్యమాన్ని ఆపేది లేదని గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.సురేంద్ర హెచ్చరించారు. ఆశ్రమ గురుకుల పాఠశాలల్లో వరుసగా సంభవిస్తున్న గిరిజన విద్యార్థుల మరణాలపై అధికారుల నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ ప్రజా సంఘాల ఐక్య వేదిక బుధవారం ఐటిడిఏ వద్ద తలపెట్టిన మహా ధర్నా విజయవంతమైంది. విద్యార్థులు ర్యాలీగా ఐటిడిఏ వద్దకు తరలివచ్చారు. అనంతరం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సురేంద్ర మాట్లాడుతూ, 17 రోజులుగా పాడేరు ఐటీడీఏ వద్ద దీక్షలు కొనసాగుతున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం కనీసం స్పందించకపోవడంతో మహా ధర్నాకు పిలుపునివ్వడం జరిగిందని తెలిపారు. ఈ మహాధర్నాను ఆపేందుకు కుయుక్తులు పన్నినా ఉద్యమాన్ని ఆపలేకపోయారని తెలిపారు. నిరాహార దీక్షలు చేస్తున్నప్పటికీ అధికారులు, ప్రభుత్వం పట్టించుకోకపోవడం చాలా దారుణ మన్నారు. ప్రభుత్వం స్పందించేంతవరకు ఉద్యమం ఆపేది లేదని, వెంటనే జోక్యం చేసుకొని, గిరిజన విద్యార్థుల వరస మరణాలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల మరణాలు అరికట్టేందుకు తక్షణమే ఆశ్రమాల్లో హెల్త్ అసిస్టెంట్లను నియమించాలని తెలిపారు. గిరిజన ఆశ్రమ విద్యార్థుల మరణాలు అరికట్టేందుకు శాశ్వత పరిష్కార మార్గం చూపాలన్నారు. ప్రజా సంఘాలతో సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. రెండు నెలల వ్యవధి కాలంలోనే ఆరుగురు విద్యార్థులు మరణించినా అధికారులకు, ప్రభుత్వానికి చలనం లేదని తెలిపారు. విద్యార్థుల సమస్యల్ని ఐటిడిఏ పిఒ గోపాలకష్ణ పట్టించుకోవడం మానేశారని, ఆశ్రమాల్లో విద్యార్థులు చర్మవ్యాధులతో అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెదబయలు తహసీల్దార్ ఆత్మహత్యపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణకు ఆదేశించాలని, బాధ్యులు ఎంతటి వారైనా కఠినంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాడేరు ఐటీడీఏ పీవో ను రక్షించడం కోసం, అమాయక ఉద్యోగులను బలి చేయడం సరికాదని, వారి సస్పెండ్‌ను తక్షణమే ఎత్తి వేయాలని తెలిపారు. ప్రజా సంఘాల ప్రతినిధులను గిరిజన విద్యాసంస్థల్లో ప్రవేశాన్ని నిరాకరిస్తూ గిరిజన సంక్షేమ ముఖ్య కార్యదర్శి జారీ చేసిన సర్క్యులర్ తక్షణమే రద్దు చేయాలన్నారు.

ప్రజా సంఘాల నేతలను అడ్డుకుంట్నున పోలీసులు

ప్రజా సంఘాల వేదిక కన్వీనర్ కూడా రాధాకృష్ణ, కో కన్వీనర్ ప్రభుదాస్ మాట్లాడుతూ, నిర్బంధాలతో ఉద్యమాన్ని ఆపలేరని హెచ్చరించారు. ఈ మహా ధర్నాను భగ్నం చేయడానికి అనేక కుయుక్తులు పన్నారని, తెల్లారి ఐదు గంటల నుండి పోలీసులు ప్రతి ఆశ్రమ హాస్టల్స్, కాలేజీలలో పహారాతో విద్యార్థులను భయభ్రాంతులకు గురి చేశారన్నారు. 17 రోజులుగా రిలే నిరాహార దీక్ష చేపడుతున్నా గిరిజన ఎమ్మెల్యేలు, ఎంపీ స్పందించక పోవడం చాలా దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు పి.లక్కు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఫణీంద్ర, రాజశేఖర్, ఏఐటీయూసీ నాయకుల అమర్, జీవన్ కృష్ణ, మహిళా సంఘం నేతలు కంబిడి లతా కుమారి, కెజియా రాణి , స్వరూప, రవణమ్మ, ప్రజా సంఘాల వేదిక నాయకులు చిన్నారావు, వరహాలబాబు, టి.చిరంజీవి, పి.ప్రకాష్, బత్తిరి నరేష్, జాన్ వెస్లీ గిరిజన సంఘం నాయకులు రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సురేంద్ర

రోడ్ షోలు, ర్యాలీల నిషేధ

జిఒను ఉపసంహరించుకోవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనరస

ప్రజాశక్తి -పాడేరు: రాష్ట్రంలో రోడ్ షోలు, ర్యాలీలను నియంత్రించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జివోను తక్షణమే ఉపసంహరించుకోవాలని సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శి పి.అప్పలనరస డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పి పుచ్చుకోవడానికే ఈ జివో తీసుకు వచ్చిందని విమర్శించారు. పోలీసులకు సర్వాధికారాలు కట్టబెట్టడం ప్రజాస్వామ్య వ్యవస్థకే ప్రమాదమన్నారు. పోరాడి సాధించుకోవాల్సిన పౌర హక్కుల్ని ఏ పేరుతో అణచివేసినా సిపిఎం వ్యతిరేకిస్తోందన్నారు. కందుకూరు, గుంటూరు ఘటనలను ఆసరా చేసుకొని రాష్ట్ర, మున్సిపల్, పంచాయతీ రోడ్‌లలో సభలు, ర్యాలీలు, రోడ్‌షోలు నిషేధించడం

అప్రజాస్వామికమని విమర్శించారు. రోడ్లపైన ర్యాలీలు, సభలు జరిపితే ఇటువంటి ఘటనలు జరుగుతు న్నాయనుకుంటే గుంటూరులో గ్రౌండ్‌లో సభ జరిపినా దుర్ఘటన జరగడం పోలీసుల వైఫల్యం స్పష్టంగా కనపడుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తన వైఫల్యాన్ని కప్పి పుచ్చుకోవడానికి ప్రజాస్వామ్య, పౌరహక్కులను కాలరాయటానికి ఇటువంటి జివో తీసుకురావడం గర్హనీయమన్నారు ఇప్పటికే గిరిజనులు, కార్మికులు, రైతులు, ప్రజలు ఆందోళనలు చేస్తుంటే ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం అణచి వేస్తోందని, ముందస్తు అరెస్టులు చేస్తోందన్నారు. ఊరికి దూరంగా ప్రజలతో సంబంధం లేకుండా సభలు జరుపుకోవడం ఆమోదయోగ్యం కాదన్నారు. ప్రజలు, ప్రతిపక్షాలు, ప్రజాతంత్రవాదుల నోరు నొక్కే ప్రయత్నమే ఈ జిఒ ఉద్ధేశ్యమన్నారు.అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, పౌర హక్కుల సంఘాలు, న్యాయకోవిదులు ఈ జిఒను వ్యతిరేకిస్తూ ముందుకు రావాలని ఆయన కోరారు.

ముంచింగి పుట్టు: రోడ్ షోలు, ర్యాలీల నిషేధ జీవో 1ని రాష్ట్ర ప్రభుత్వం ఉపసహరించుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి పి.భీమరాజు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం తన వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికి ఈ జీవో 1 తీసుకువచ్చిందని, పోలీసులకు సర్వాధికారులు కట్టబెట్టడం పై ప్రజాస్వామ్యం వ్యవస్థకు ప్రమాదమన్నారు. ఆందోళనలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం పోలీసు యంత్రాంగంతో అణచి వేస్తుందన్నారు. ఈ సమావేశంలో మండల వైస్ ఎంపీపీ1 పాటుబోయి సత్యనారాయణ, లక్ష్మీపురం సర్పంచ్ కే.త్రినాథ్, గిరిజన సంఘం మండల కార్యదర్శి ఎంఎం శ్రీను, సిఐటియు సీనియర్ నాయకులు సిరగం గాసిరం దొర పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్, చిత్రంలో ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

చిన్న పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి - రంపచోడవరం

ఏజెన్సీలోని చదువుకొని ఖాళీగా ఉన్న యువతీ యువకులను గుర్తించి వారు చిన్న చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకునే విధంగా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. బుధవారం స్థానిక ఐటిడిఏ సమావేశ మందిరంలో ఏడు మండలాలకు చెందిన బ్యాంకు మేనేజర్లు,క వెలుగు ఏపీడి, డిపిఎం, చిన్న పరిశ్రమల ప్రాజెక్ట్ అధికారి తదితరులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం, బడుగు వికాసం పథకానికి ఇప్పటివరకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయి, ఎన్ని మంజూరు చేశారు, ఇంకా బ్యాంకులలో ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయో ఆరా తీశారు. పెండింగ్ లో ఉన్న దరఖాస్తులన్నింటిని క్షుణ్ణంగా పరిశీలించి వివిధ రకాలైన చిన్న చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకునే విధంగా బ్యాంకర్లు రుణాలు మంజూరు చేయాలని కోరారు. ముందుగా ఒక్కొక్క మండలంలో పదిమంది లబ్ధిదారులను ఎంపిక చేసి, రుణాలు మంజరైన లబ్ధిదారులతో శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పోలవరం ప్రాజెక్టు ముంపునకు గురైన రైతులకు ట్రాక్టర్ల కోసం దరఖాస్తులు తీసుకోవాలన్నారు. మారేడుమిల్లి మండలం గుడిసె పర్యటక ప్రాంతానికి వచ్చే టూరిస్టులకు వాహనాల అద్దెకిచ్చే వాహనాలు మంజూరుకు దరఖాస్తులు స్వీకరించాలన్నారు. ఏజెన్సీలోని రైతులందరికీ క్రాప్ లోన్లు మంజూరు చేయాలన్నారు. నాటు సారా తయారు చేసి, అమ్ముతూ పట్టుబడి వారిని గుర్తించి వారు చేత చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే విధంగా రుణాలు మంజూరు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఐటిడిఏ పిఒ సూరజ్ గనోరే, ఎస్‌బిఐ రీజనల్ మేనేజర్ ఎం.సురేష్ బాబు, ప్రాజెక్ట్ అధికారి శ్రీనివాసరావు, లీడ్ బ్యాంకు మేనేజర్ రవితేజ, యూనియన్ బ్యాంక్ ఎజిఎం బిజిఆర్ నాయుడు, వెలుగు ఏపీడి ఎ.శ్రీనివాసరావు, డిపిఎంలు అపర్ణ, పరమేశ్వరరావు, యాంకర్ పర్సన్ రామరాజు, యూనియన్ బ్యాంక్ మేనేజర్ రాజ్ కిషోర్ భార, స్టేట్ బ్యాంక్ మేనేజర్ ఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ట్యూషన్ చెబుతున్న టీచర్

ఐద్వా ఆధ్వర్యంలో ట్యూషన్ సెంటర్

ప్రజాశక్తి- కూనవరం

మండలంలోని చినార్కూరు గ్రామంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకొని ట్యూషన్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐద్వా నాయకులు కుంజా రాధ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సావిత్రి బాయి పూలేని ఆదర్శంగా తీసుకువాలన్నారు. పిల్లలు మంచి చదువులతో ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, చిన్నారులు పాల్గొన్నారు.

డిఎఫ్ఒకు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు సురేష్ తదితరులు

వెదురు కార్మికులకు వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి చింతూరు

తులసి పాక కొండలపై గతేడాది వెదురు కర్రలు నరికి, డిపోలకు తరలించిన కార్మికులకు తక్షణమే వేతనాలను చెల్లించాలని సిపిఎం నాయకులు బుధవారం చింతూరు డిఎఫ్ఓకు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి సీసం సురేష్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న రూ.1.20 లక్షలు కార్మికులకు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఫారెస్ట్ అధికారులు, ఎఫ్ఆర్ఓ రాజుపై చర్య తీసుకొని కార్మికులకు వేతనాలు చెల్లించాలని, లేనిపక్షంలో బ్యాంబో కార్మికులతో పెండింగ్ వేతనాలు చెల్లించే వరకు పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సాదుల స్వామి రెడ్డి, మడకం లక్ష్మణ్, ఎరకం బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికునికి ఆర్థిక సహాయం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన భవన నిర్మాణ కార్మికుడు మండా రమణబాబుకు స్థానిక శ్రీసీతారామరాజు ఎలక్ట్రికల్ యూనియన్ అధ్యక్షులు కలవపల్లి రాంబాబు, నాయకులు బుధవారం ఆర్థిక సహాయం అందజేశారు. ఎలక్ట్రికల్ యూనియన్ నాయకులు బుధవారం రాత్రి రమణ బాబును పరామర్శించి రూ.2,500 నగదు, పండ్లు అందజేశారు. మరికొంత సహాయం అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు వానపల్లి నాగేంద్ర, ధోనె రాము, వెచ్చం భద్రం, బొడ్డపాటి కామరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న ఎలక్ట్రికల్ యూనియన్ సభ్యులు

నూతన ఎంపిటిసిల ఫోరం అధ్యక్షులుగా హరి

ప్రజాశక్తి-హుకుంపేట:మండలంలో ఎంపిటిసి ఫోరం నూతన అధ్యక్షులుగా మజ్జి హరిని ఏకగ్రీవంగా బుధవారం ఎన్నుకున్నారు. మండలంలోని బూర్జ పంచాయతీకి చెందిన ఎంపీటీసీ మజ్జి హరిని హుకుంపేట మండలంలో ఉన్న 6 మంది ఎంపీటీసీలు కలిసి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ ఫోరం అధ్యక్షులు మజ్జి హరి మాట్లాడుతూ, మండలంలో ఎంపీటీసీల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. గ్రామాల్లో తాగునీరు, సిసి రోడ్లు, విద్యుత్ సమస్యలపై ప్రశ్నించేందుకు ముందుంటానన్నారు. హరిని వైస్ ఎంపిపిలు ఒంటిమి ప్రియాంక, సుడిపల్లి కొండలరావు, ఎంపిటిసిలు నైని రజిని, కె.మీనా, జి.సుశీల సంతారి, సాంబె బాలకృష్ణ.కొట్నా పల్లి తదితరులు అభినందించారు.

పులి సంచారంతో భయాందోళన

ప్రజాశక్తి-అనంతగిరి:మండలంలోని ఎన్ఆర్ పురం, రొంపల్లి పంచాయతీలలో పులి దుక్కటెద్దులపై దాడి చేయడంతో గిరిజనులు భయాందోళనకు గురవుతున్నారు. గత మూడు నాలుగు రోజుల క్రితం గ్రామంలో సంచరించిన పులి ఆవులు, మేకలపై దాడి చేయడంతో గిరిజనులు బిక్కు బిక్కుమంటున్నారు. ఈ పంచాయతీ పరిధిలో కరెంటు సౌకర్యం లేక రాత్రి సమయంలో భయాందోళనతో బిక్కు బిక్కు మంటూ గడపాల్సిన పరిస్థితి నెలకొంది.

మరో మూడు రోజులు ఉచిత బియ్యం

ప్రజాశక్తి-పాడేరు:అల్లూరి సీతారామరాజు జిల్లా సంయుక్త కలెక్టర్ జె.శివ శ్రీనివాసు చొరవతో మరో మూడు రోజుల పాటు ప్రదానమంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన (పిఎమ్ జికెఎవై) పథకం కింద ఇస్తున్న ఉచిత బియ్యం పంపిణీ మరో మూడు రోజులు సరఫరా చేయడానికి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని డిసెంబర్ నెలలో అనివార్య కారణాలతో బియ్యం తీసుకోలేని పిఎమ్ జికెఎవై లబ్ధిదారులు ఉచిత బియ్యం విడిపించుకోవాలని జెసి కోరారు. గత నెలలో సాంకేతిక కారణాల రీత్యా పిఎమ్ జికెఎవై బియ్యం పూర్తి స్థాయిలో సరఫరా కానందున, డిసెంబర్ 31తో గడువు ముగిసినందున మరో మూడు రోజులు పిఎమ్ జికెఎవై ఉచిత బియ్యం పంపిణీకి అనుమతి కోరుతూ జెసి ప్రభుత్వానికి నివేదిక పంపారు. ప్రభుత్వం స్పందించి ఈ మేరకు ఈ నెల 5వ తేదీ నుంచి 7వ తేదీ వరకు పిఎమ్ జికెఎవై ఉచిత బియ్యం పంపిణీకి అనుమతించిందని జెసి వివరించారు.

రూ.5 వేల ఆర్థిక సాయం

ప్రజాశక్తి-పాడేరు:రోడ్డు ప్రమాదంలో గాయపడిన పట్టణంలోని ఎలక్ట్రీషియన్ నితీష్ కుమార్‌కు మోద ఉమానీలకంటేశ్వర ఎలక్ట్రీషియన్, ప్లంబర్ యూనియన్ తరపున రూ.5 వేల నగదును అందజేశారు. ఈ యూనియన్‌లో సభ్యుడుగా ఉన్న నితీష్ కుమార్ స్కూటీ పై వెళుతుండగా ప్రమాదం జరిగింది. ఈ మేరకు బాధితుడికి యూనియన్ అధ్యక్షుడు రామారావు 5 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి సందడి దామోదరం, ఉపాధ్యక్షుడు సరమండ వరప్రసాద్, కార్యదర్శి బంగురు ప్రకాశ్ రావు, కోట సన్యాసిరావు (చిన్న), బబ్లూ, మఠంస్వామి నాయుడు తదితర సభ్యులు పాల్గొన్నారు.

బాధితునికి నగదు అందజేస్తున్న రామారావు

విష జ్వరాలు ప్రబలకుండా ముందస్తు చర్యలు

డిఎంహెచ్ఒ జమిల్ బాషా

ప్రజాశక్తి మారేడుమిల్లి

మలేరియా, డయేరియా, డెంగీ వంటి వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జమిల్ బాషా వైద్యాధికారులను ఆదేశించారు. మండలంలోని బోదులూరు పిహెచ్‌సి, గిరిజన ఆశ్రమ హైస్కూల్‌ను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఆశ్రమ హైస్కూల్‌లో బాలికలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. విద్యార్థినులకు పౌష్టికాహారం, పరిసరాల పరిశుభ్రత, రక్తహీనత నివారణ, తీసుకోవలసిన జాగ్రత్తలు, వ్యక్తిగత పరిశుభ్రత వంటి వాటిపై అవగాహన కల్పించారు. నులిపురుగుల నివారణకు తప్పనిసరిగా ఆరు నెలలకు ఒకసారి ఆల్బెండజోల్ మాత్రను అందించాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు. బోదులూరు గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం, వైద్య సేవల గూర్చి అడిగి తెలుసుకున్నారు. అనంతరం బోదులూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సందర్శించి అన్ని వార్డులను, రికార్డులను తనిఖీ చేశారు. మందులను పరిశీలించారు. ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రోగ్రామ్ ద్వారా గ్రామాలలో వైద్య శిబిరాలు నిర్వహించాలని ఆదేశించారు. కోవిడ్ నాలుగో వేవ్ కారణంగా కోవిడ్ టెస్టులను పిహెచ్‌సిలలో అందుబాటులో ఉంచడం జరిగిందని చెప్పారు. మాతృ, శిశు మరణాల నివారణకై తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారులు, స్కూల్ ఉపాధ్యాయులు, జిల్లా టిబి పర్యవేక్షకులు వి కిరణ్, పిహెచ్‌సి సిబ్బంది, అంగన్వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలింతతో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ జమిల్‌బాషా

పరీక్ష కేంద్రం ఏర్పాటుచేయాలని ర్యాలీ

ప్రజాశక్తి -సీలేరు

సీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతూ విద్యార్థులు బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. జీకే వీధి మండలంలో పరీక్ష కేంద్రం మాకొద్దు సీలేరు జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రం ముద్దు అంటూ నినాదాలు చేశారు. సీలేరు మార్కెట్ సెంటర్ చేరుకొని మానవహారంగా నిర్వహించారు. అధికారులు తక్షణమే సీలేరులో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించాలన్నారు. అనంతరం ర్యాలీగా గ్రామపంచాయతీ కార్యాలయానికి చేరుకొని గ్రామ సభలో పాల్గొన్న కార్యదర్శి శ్రీనివాస్, ఎంపీటీసీ పిల్ల సాంబమూర్తికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ నాలుగు సంవత్సరాలు నుంచి జీకే వీధి మండల కేంద్రంలో పరీక్షా కేంద్రం తరలించడంతో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. పరీక్ష కేంద్రానికి వెళ్లడానికి కనీస బస్సు సౌకర్యాలు లేకపోవడంతో అనేక ఇబ్బందులు గురవుతున్నామని వాపోయారు. అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఐటిడిఏ పి ఓ రోణంకి గోపాలకృష్ణ, కమిషనర్ పరీక్ష కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు.

ర్యాలీ నిర్వహిస్తున్న జూనియర్ కళాశాల విద్యార్థులు

ఆరుగురిపై బైండోవర్ కేసులు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

రానున్న సంక్రాంతి పండుగ నేపథ్యంలో కోడిపందేలు, జూదం, గుండాట, చిత్తులాట వంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడకుండా ఉండేందుకు ముందస్తు చర్యలో భాగంగా జడ్డంగి, రాజవొమ్మంగి పోలీస్ స్టేషన్ పరిధిలో ఆరుగురు వ్యక్తులపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు ఆ రెండు పోలీసు స్టేషన్ల ఎస్ఐలు టీజీ నరేంద్ర ప్రసాద్, షరీఫ్ బుధవారం తెలిపారు, ఆరుగురు వ్యక్తులను రాజవొమ్మంగి మెజిస్ట్రేట్ ఎదుట ఆధారపరిచి కోడిపందేలు, జూదం, గుండాట వంటివి నిర్వహించమని వారి వద్ద నుండి అఫిడవిట్ తీసుకున్నట్లు తెలిపారు.

మాట్లాడుతున్న సర్పంచ్

పలు చోట్ల గ్రామసభలు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలంలోని కిలగాడ గ్రామ పంచాయతీలో స్థానిక సర్పంచ్ కె.శివశంకర్రావు అధ్యక్షతన గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెలలో కొత్తగా 16 పెన్షన్లు మంజూరు కాగా పంచాయతీ పరిధిలో 350 పెన్షన్లు వస్తున్నాయని తెలిపారు. జల జీవన్ మిషన్ ద్వారా ఇంటింటి కుళాయి ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు వెంటనే పంచాయతీ అకౌంట్లో వేయాలని కోరారు. ఈ గ్రామ సభలో వార్డు మెంబర్లు కిరణ్ కుమార్, బొంజు బాబు, మత్య రాజు, సుభద్ర, వాలంటీర్స్, సచివాలయం సిబ్బంది, అంగన్వాడిలు, ఆశ వర్కర్ పాల్గొన్నారు.

దుంబ్రిగుడ: మండలంలోని గసభ పంచాయతీ సచివాలయంలో సిపిఎం సర్పంచ్ పాంగి సునీత అధ్యక్షతన బుధవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన సామాజిక పింఛన్‌లను 9మందికి సర్పంచ్ సునీత, ఎంపిటిసి వి.జెమ్మ, వార్డుమెంబర్స్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. జాతీయ గ్రామీణ ఉపాధిహామి పథకం ద్వారా మట్టి రోడ్లు, వ్యక్తిగత పనుల కోసం తీర్మానం చేశారు. పంచాయతీ నిధులతో మంచినీటి సౌకర్యం, విధిదీపాలను కల్పిస్తామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు ఉండేవిధంగా సచివాలయ ఉద్యోగులు, గ్రామ వాలంటీర్స్ పారదర్శకంగా పని చేయాలన్నారు.విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఈకార్యక్రమంలో ఉపసర్పంచ్ మహదేవ్, గసభ మాజీ సర్పంచ్ పాంగి సురేష్ కుమార్ వార్డుమెంబర్స్ ,సచివాలయ ఉద్యోగులు,పంచాయతీ పరిధిలోని ఉద్యోగులు పంచాయతీ గిరిజనులు పాల్గొన్నారు.

5న ఎలక్టోరల్ అబ్జర్వర్ పర్యటన

ప్రజాశక్తి-పాడేరు: ఈనెల 5న ఎలక్టోరల్ అబ్జర్వర్ అహ్మద్ బాబు అల్లూరి జిల్లాలో పర్యటిస్తారని కలెక్టర్ సుమిత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తేదీ ఉదయం 7గంటలకు విశాఖపట్నంలో బయలుదేరి 10 గంటలకు పాడేరు చేరుకొని 10.30 గంటలకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్నికల జాబితాకు సంబంధించి ఇఆర్ఒ, ఎఇఆర్ఒలతో సమీక్ష నిర్వహిస్తారని పేర్కొన్నారు. సమీక్ష అనంతరం 12 గంటలకు బయలుదేరి వి.మాడుగుల మీదుగా విశాఖపట్నం చేరుకొని అక్కడి నుంచి విమానంలో విజయవాడ వెళ్తారని కలెక్టర్ వివరించారు. ఈ సమీక్షా సమావేశానికి ఇఆర్ఒలు, ఎఇఆర్ఒలు నివేదికలతో హాజరు కావాలని కలెక్టర్ కోరారు.

భయానికి అంబాసిడర్ జగన్మోహన్ రెడ్డి : అనిత

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : భయానికి బ్రాండ్ అంబాసిడర్‌గా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మారిపోయారని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు వంగలపూడి అనిత ఆరోపించారు. విశాఖలోని టిడిపి కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ, పిరికి తనానికి పాస్‌పోర్ట్ తీసుకుంటే వైఎస్ జగన్ అనిపిస్తోందని ఎద్దేవా చేశారు. పరదాల మాటున సభలు నిర్వహిస్తున్నారని, జనాలలోకి వెళ్లాలంటే భయపడుతున్నారని విమర్శించారు. సిఎం సభల్లో నల్ల రంగు, పసుపు రంగు దుస్తులు కనపడకూడదంటున్నారని, ఇంత భయం దేనికని ప్రశ్నించారు. జగన్ భయపడుతున్నారనడానికి కుప్పంలో పోలీస్ చర్యలే నిదర్శనమన్నారు. కందుకూరు సంఘటన దురదృష్టకరమని పేర్కొన్నారు. గుంటూరులో ఘటన మాత్రం వైసిపి కుట్ర కనిపిస్తోందని, దీనిపై సిబిఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. జిఒ 1 ఇచ్చిన మరుసటి రోజే రాజమండ్రిలో ఇరుకు సందులో సిఎం జగన్ రోడ్ షో చేయవచ్చా అని ప్రశ్నించారు. జంగారెడ్డిగూడెంలో కల్తీ మద్యం తాగి ఐదుగురు మృతిచెందితే మద్యం నిషేధించారా, కచ్చులూరులో బోట్ ప్రమాదం జరిగి పలువురు మృతి చెందితే పర్యాటక ప్రయాణాలు ఆపేశారా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో సిఎం జగన్ సభలు జరపడానికి, టిడిపి నేతలను అరెస్టులు చేయటానికే పోలీసులు పనిచేస్తున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో తెలుగు మహిళ విశాఖ పార్లమెంట్ అధ్యక్షులు సర్వసిద్ధి అనంతలక్ష్మి, రాష్ట్ర మహిళా అధికార ప్రతినిధి ఈతలపాక సుజాత, కార్యదర్శి నక్క పద్మ తదితరులు పాల్గొన్నారు.

పుట్టగొడుగుల్లా టెంట్ హౌస్‌లు

మరుగుదొడ్లు, సీసీ కెమెరాలు, తాగునీరు కల్పించని నిర్వాహకులు

ఇబ్బంది పడుతున్న పర్యాటకులు

టెంట్ హౌస్‌లు

ప్రజాశక్తి -దుంబ్రిగూడ: ఆంధ్ర ఊటీగా అరకు పర్యాటక ప్రాంతం ప్రఖ్యాతి గాంచడంతో పర్యాటకుల సౌకర్యం కోసం టెంట్ హౌస్ లు పుట్టగొడుగుల పుట్టుకొస్తున్నాయి. నిర్వాహకులు పర్యాటకుల సౌకర్యార్థం కోసం మరుగుదొడ్లు, సీసీ కెమెరాలు, తాగునీరు సౌకర్యంతో పాటు రక్షణగా చుట్టుప్రక్కల రక్షణ కంచె సౌకర్యం ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ కొన్ని టెంట్ హౌస్ లో ఇటువంటి సౌకర్యాలు ఏమి కల్పించకుండానే నిర్వహణ కొనసాగిస్తున్నారు. వీటిపై సంబంధిత ఉన్నత స్థాయి అధికారుల పర్యవేక్షణ లేక పోవడంతో పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించకుండానే కొన్నిచోట్ల వారి ఇష్టానుసారంగా నిర్వహణ చేసుకుంటున్నట్లు తెలుస్తుంది. మండలంలోని బురద గడ్డ నుంచి చాపరాయి జలపాతం వరకు టెంట్ హౌస్ ఏర్పాటు చేశారు. జైపూర్ జంక్షన్ లోనే అధిక సంఖ్యలో టెంట్ హౌస్ లు ఏర్పాటు చేశారు. ఒక్కో టెంట్‌కు రూ.300 నుంచి 600 వరకు పర్యాటకుల నుంచి వసూలు చేస్తున్నట్లు తెలుస్తుంది. జైపూర్ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన టెంట్ హౌస్‌లలో కొన్ని టెంట్ హౌస్‌ల చోట సీసీ కెమెరాలు, మరుగుదొడ్లు ఏర్పాటు చేసి ఉండగా మరికొన్ని చోట అటువంటి ఏమి సౌకర్యాలు కల్పించలేదు. అరకు ప్రాంతంలో దేశ విదేశాల నుంచి అధిక సంఖ్యలో పర్యాటకులు సందర్శిస్తుంటారు. వారికి ఇబ్బంది కలగకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పించి టెంట్ హౌస్ లో నిర్వహణ సాగించాల్సి ఉన్నప్పటికీ పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించకపోవడంతో సందర్శించిన పర్యాటకులు ఇబ్బందులకు గురవుతున్నారు. వీటి నిర్వహణకు సంబంధిత అధికారులు అనుమతులు ఇచ్చే ముందు అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేశారో లేదో పరిశీలించాల్సి ఉంది. సంబంధిత అధికారులు వాటిపై దృష్టి పెట్టకపోవడంతో పూర్తిస్థాయిలో సౌకర్యాలు లేకుండానే నిర్వహణ కొనసాగిస్తున్నట్లు తెలుస్తుంది. వీటిపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పర్యాటకుల సౌకర్యార్థం మరుగుదొడ్లు, తాగునీరు, సీసీ కెమెరాలతో పాటు రక్షణ కంచె ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని పర్యాటకులు, స్థానికులు కోరుతున్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

ప్రజాశక్తి-పాడేరు టౌన్: పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. పాడేరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన పెన్షన్ వారోత్సవాల కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సిఎం జగన్ ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ నగదును పెంచి లబ్ధిదారులకు నెలకు రూ.2,750లు ఇస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో 39 లక్షలు ఉండే సామాజిక పెన్షన్‌లు వైసిపి ప్రభుత్వంలో 64 లక్షల పెన్షన్‌లు అందిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఎస్.రత్నకుమారి, ఎంపిడిఒ కె.సాయినవీన్ పాల్గొన్నారు.

పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, ఎంపిపి

పాడేరు టౌన్: టిడిపి సభలు, సమావేశాల్లో ప్రజల ప్రాణాలు పోతుంటే ప్రభుత్వం చూస్తూ ఊరుకోవాలా అని ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. ప్రజల ప్రాణాలు పోతున్నా ప్రతిపక్ష పార్టీ టిడిపి తీరు మారడం లేదని విమర్శించారు. మండలంలోని బొడ్డపుట్టు, సరియపల్లి, వై.సోలములు, డి.సోలములు, తదితర గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. గడపగడపకు వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకుంటూ ప్రభుత్వ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న జనాదరణను చూసి ఓర్వలేక ప్రభుత్వంపై లేనిపోని విమర్శలు చేయడం తగదన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు ఎస్.లక్ష్మణరావు, వి.రాంబాబు, పార్వతమ్మ, వ్యవసాయ సలహా మండల చైర్మన్ సరస్వతి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సూరిబాబు, మాజీ ఎంపిపి మంగ్లన్న దొర, వైసిపి నాయకులు కన్నాపాత్రుడు, లింగమూర్తి, సత్యనారాయణ, బాబుల్ నాయుడు, రామలింగం, కోటిబాబు, సత్యవతి, సుశీల పాల్గొన్నారు.

వైసిపి ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయి

ప్రజాశక్తి-పాడేరు టౌన్: టిడిపి అధినేత చంద్రబాబు సభలు, సమావేశాలు, రోడ్ షోల్లో వస్తున్న ప్రజాదరణకు భయపడి జగన్ ప్రభుత్వం చీకటి జిఒ తెచ్చిందని, వైసిపి ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని మాజీ ఎమ్మెల్యే, పాడేరు నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ గిడ్డి ఈశ్వరి విమర్శించారు. కుప్పంలో టిడిపి అధినేత చంద్రబాబు పర్యటనను అడ్డుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ప్రజాశక్తితో ఆమె మాట్లాడారు. చంద్రబాబుకు వస్తున్న ప్రజాదరణను జగన్ తట్టుకోలేకపోతున్నారన్నారు. ప్రతిపక్షాలకు పెట్టిన నిబంధనలు వైసిపి సభలకు, సమావేశాలకు ర్యాలీలకు వర్తించవా? అని ఆమె ప్రశ్నించారు. చీకటి జిఒలతో ప్రతిపక్షాలను అడ్డుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరూ తిరిగే స్వేచ్ఛ ఉందని అన్నారు.

మాట్లాడుతున్న వివి జయ

ఉచితంగా కుట్టు శిక్షణ

ప్రజాశక్తి -అరకులోయరూరల్: మండలంలోని బొండం పంచాయతీ రంగినివలస గ్రామంలో ఉచిత కుట్టు మిషన్ శిక్షణను రోటరీ క్లబ్ (విశాఖపట్నం) సహకారంతో బుదవారం గిరిజన మహిళ సంఘం ఆధ్వర్యాన ఐద్వా రాష్ట్ర నాయకురాలు వివి జయ ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడారు. గిరిజన ప్రాంతంలో మహిళలు స్వతంత్రంగా తన కాళ్లపై తాను నిలబడాలని ఈ కుట్టు మిషన్ ట్రైనింగ్ ప్రారంభించామన్నారు. మహిళలకు చదువుతో పాటు అనేక రకాల అవకాశాలు కల్పించాలని ఉద్దేశంతో ట్రైనింగ్ సెంటర్ మొదలు పెట్టామన్నారు.అరకువేలి గిరిజన సంఘం కార్యాలయంలో ఈ నెల 10వ తేదీ నుండి ప్రారంభం అవుతుందన్నారు. శిక్షణ నిమిత్తం సుమారు 50 మంది పేర్లు నమోదు చేసుకున్నారని, వీరికి రెండు నెలలు శిక్షణ ఇచ్చి సర్టిఫికేట్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో శశికళ, కళ, లక్ష్మీ రాధ, గిరిజన సంఘం నాయకులు పి.నాని బాబు, గ్రామ మహిళలు పాల్గొన్నారు.

ముగిసిన 'తులసీరావు' శకం

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి, కలెక్టరేట్, యలమంచిలి విలేకరి

విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి తులసీరావు శకం ముగిసింది. ఆయన హైదరాబాదులోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మరణించారు. యలమంచిలి మేజర్ పంచాయతీకి 25 ఏళ్ల పాటు సర్పంచ్‌గా పనిచేశారు. తులసీరావుకు ముందు ఆయన తండ్రి, తాత యలమంచిలి సర్పంచ్‌గా ఉన్నారు. సర్పంచ్‌గా ఎన్నికైనప్పటి నుంచి ఇప్పటివరకు ఆ పట్టును ఆయన నిలబెట్టుకున్నారు. తన కుమార్తె రమాకుమారిని సర్పంచ్‌గానూ, రెండుసార్లు యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్‌గా గెలిపించుకున్నారు. 1989లో విశాఖ డెయిరీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి మరణించే వరకు కొనసాగారు. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా తన పదవిని కాపాడుకోగలిగారు. ఆయన ఆరోగ్యం రెండేళ్ల నుంచి బాగోలేకపోవడంతో ఆయన రెండో కుమారుడు ఆనందకుమార్‌కు డెయిరీ కార్యకలాపాల బాధ్యతను అప్పగించారు. డెయిరీ వైస్‌చైర్మన్ బాధ్యతలు ఆనందకుమార్ చేపట్టాక డెయిరీ వ్యవహారాలన్నీ ప్రత్యక్షంగా చూస్తున్నారు. 1962లో కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ డైరెక్టర్‌గా తులసీరావు కొంతకాలం పనిచేశారు. రెండుసార్లు ఉమ్మడి విశాఖపట్నం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షునిగా పనిచేశారు. డెయిరీ ద్వారా కొన్ని అభివృద్ధి, సేవా కార్యక్రమాలను నిర్వహించి పాల ఉత్పత్తిదారుల్లో గుర్తింపు పొందారు.

కెజిహెచ్ భావనగర్, గుండె జబ్బుల విభాగాల అభివృద్ధికి డెయిరీ నిధులు అందజేశారు. చోడవరం, అనకాపల్లి, మాడుగల, ఎలమంచిలి అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో సిఎస్ఆర్ నిధులతో వంతెనలు, కల్వర్టుల నిర్మాణం, పలు గ్రామాల్లో కల్యాణ మండపాలు నిర్మాణం, కమ్యూనిటీ భవనాల నిర్మాణం వంటివి నిర్మించారు. షీలానగర్‌లో విశాఖ డెయిరీ ట్రస్ట్ తరపున కృషి ఆస్పత్రి (ప్రస్తుత కిమ్స్) నిర్మించారు. పాడి రైతుల పిల్లలకు ప్రత్యేక పాఠశాల, ఇతర పాఠశాలల్లో చదువుకున్న పిల్లలకు ప్రోత్సాహకాలు అందజేశారు. నర్సింగ్ పాఠశాలను కూడా ఏర్పాటుచేశారు. కుమారుడు ఆనంద్ కుమార్ టిడిపి తరపున 2019 ఎన్నికల్లో అనకాపల్లి పార్లమెంటు స్థానం నుంచి పోటీచేసి ఓటమి చెందాక, వైసిపిలో చేరారు. ప్రస్తుతం వైసిపి విశాఖపట్నం పశ్చిమ నియోజకవర్గం సమన్వయకర్తగా వ్యవహరిస్తున్నారు. గురువారం ఎలమంచిలిలో తులసీరావు అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

పలు అవార్డులు

తులసీరావు కాలంలో విశాఖ డెయిరీ అనేక అవార్డులు సొంతం చేసుకుంది. 2003లో ఎనర్జీ అండ్ ఫ్యూయల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నుంచి జాతీయ అవార్డు లభించింది. వాల్తేరు రోటరీ క్లబ్ కార్పొరేట్ సిటిజన్ అవార్డు అందజేసింది. పాల ఉత్పత్తులను చేస్తున్నందుకు ఉత్తమ డెయిరీగా 2009లో నేషనల్ ప్రొడక్టివిటీ కౌన్సిల్ అవార్డును కేంద్ర ప్రభుత్వం నుంచి అందుకుంది.

లూయిస్ బ్రెయిలీకి ఘన నివాళి

నివాళులర్పిస్తున్న ప్రిన్సిపల్, తదితరులు

ప్రజాశక్తి- చింతూరు

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫిజిక్స్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలు బుధవారం నిర్వహించారు. బ్రెయిలీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ జి.వెంకట్రావు మాట్లాడుతూ ప్రపంచ అంధులకు జ్ఞానకావాటాలను ప్రసాదించిన మహనీయుడు బ్రెయిలీ అని కొనియాడారు. బ్రెయిలీ బాల్యంలో ప్రమాదవశాత్తు రెండుకళ్లను కోల్పోయి తన 4వ ఏట పూర్తిగా గుడ్డివాడు అయ్యాడని, అంధుల పాఠశాలలో చదువుకొని 17 ఏళ్లకే అతను చదువుకున్న స్కూల్‌లోనే టీచర్‌గా పని చేశారని తెలిపారు. ఫిజిక్స్ శాఖ అధిపతి ఎం.శేఖర్ మాట్లాడుతూ బ్రెయిలీ పగలు విద్యార్థులకు బోధిస్తు రాత్రులు అంధులు తేలికగా చదవ గలిగే రాయగలిగే లిపి తయారీకి కషి చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు కె.శకుంతల, ఎస్.అప్పనమ్మ, ఎమ్.నాగమోహనరావు, కె.శ్రీదేవి, సిహెచ్.రాజబాబు, నునే రమేష్, ఆర్.మౌనిక, పి.ఏడుకొండలు, జి సాయికుమార్, పి. గౌతమి, వై.ఇమ్మానుయేల్, అలువేలు మంగతాయారు పాల్గొన్నారు.

పెదబయలు: సీతగుంట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఉపాధ్యాయుడు సీహెచ్ ప్రసాద్ అధ్వర్యంలో బ్రెయిలీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భవిత కేంద్రం ఉపాధ్యాయుడు నాయుడు, స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు బాలరాజు పాల్గొన్నారు.

గిరిజన ప్రాంతాన్ని ప్రత్యేకంగా చూడాలి

ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి నిరసనలో సర్పంచ్, గ్రామస్తులు

ప్రజాశక్తి-మారేడుమిల్లి

రాష్ట్ర ప్రభుత్వం గిరిజన ప్రాంతాన్ని ప్రత్యేకంగా చూసి గిరిజనుల సమస్యలను పరిష్కరించాలని టిడిపి నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని పుల్లంగి పంచాయతీ పరిధిలో చెలక వీధిలో సర్పంచ్ వీరవల్లి జార్జి బాబు ఆధ్వర్యంలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో పది ఎకరాలు భూమి ఉన్న ప్రతి ఒక్క గిరిజనులకు రేషన్ కార్డు కోల్పోవడం జరిగిందని, ప్రభుత్వం నుంచి వచ్చే ఎటువంటి పథకాలు రావడం లేదని తెలిపారు. గిరిజన ప్రాంతంలో ఉన్న భూములకు మైదాన ప్రాంతంలో భూములకు చాలా వ్యత్యాసం ఉందని, దీనిని గుర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్ సాధల సోమలమ్మ, సాధల జాన్ రెడ్డి, కలుముల వీరమ్మ, కోండ్ల సుబ్బలక్ష్మి, కలుముల ముత్యాలమ్మ, సాధల ఇందిరమ్మ గ్రామస్తులు పాల్గొన్నారు.

55 మంది గీతం విద్యార్థులకు హెటిరో ఉద్యోగాలు

ప్రజాశక్తి- మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ప్రముఖ ఔషధ పరిశ్రమ హెటిరో డ్రగ్స్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలలో 55మంది విద్యార్థులకు ఉద్యోగాలు సాధించారనిగీతం కెరీర్ గైడెన్స్ సెంటర్ డైరక్టర్ ఎస్. వంశీకిరణ్ తెలిపారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, ఆర్గానిక్, ఎనలిటికల్ కెమెస్ట్రీ ఫైనలియర్ విద్యార్థులు 50మంది, అలాగే ఐదుగురు బి.ఫార్మసీ విద్యార్థులు హెటిరో సంస్థలో క్వాలిటి ఎనలిస్ట్, క్వాలిటీ కంట్రోలర్ ఉద్యోగాలకు ఎంపికయ్యారని తెలిపారు. నమూనా ఇంటర్వ్యూలు, నిరంతర శిక్షణ గీతం విద్యార్థులు ప్రాంగణ నియామకాలలో ఎంపిక కావడానికి దోహదపడ్డాయని కెరీర్ ఫుల్‌ఫిల్‌మెంట్ సీనియర్ మేనేజర్ ప్రభ మహంతి తెలిపారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ ఎమ్.బాలకుమార్, గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ డీన్ డాక్టర్ రామారావు, సైన్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.వేదవతి, రసాయన శాస్త్ర విభాగం అధిపతి ప్రొఫెసర్ బి. శ్రీనివాసరావు అభినందించారు.

ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో గీతం ప్రతినిధులు

వేతన ఒప్పందంపై స్టీల్ ఉన్నత యాజమాన్యం స్పందించాలి

ప్రజాశక్తి-ఉక్కునగరం : స్టీల్ కార్మికులకు నూతన వేతన ఒప్పందం అమలుపై ఉక్కు ఉన్నత యాజమాన్యం తక్షణ స్పందించాలని స్టీల్ సిఐటియు అధ్యక్షులు వైటీ దాస్ డిమాండ్ చేశారు. బుధవారం స్టీల్ సిఐటియు కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ ఎన్‌జెసిఎస్ సమావేశంలో కుదిరిన ఒప్పందం మేరకు సెయిల్ యాజమాన్యం నూతన వేతనాలు అమలు చేసినా, విశాఖ స్టీల్‌ప్లాంట్ అమలు చేయలేదన్నారు. దీనిపై స్టీల్ అఖిలపక్ష కార్మిక సంఘాలు ఆధ్వర్యంలో జనవరి 31న సమ్మె నోటీసును అందజేశామని గుర్తు చేశారు. సమ్మె విరమించుకోమని స్వయంగా కోరిన స్టీల్ సిఎండి అతుల్‌భట్, ఫిబ్రవరిలో జరిగే బోర్డు మీటింగ్‌లో సమస్య పరిష్కారిస్తానని హామీ ఇచ్చారన్నారు. దానికి అనుగుణంగానే బోర్డు సమావేశాన్ని నిర్వహించి, సభ్యుల ఆమోదంతో మే 20న స్టీల్ మంత్రికి, కార్యదర్శికి పంపామన్నారు. దీనిపై ఆర్‌టిఐ ద్వారా వివరాలు కోరితే విరుద్ధమైన జవాబువచ్చిందన్నారు. తమ యూనియన్, నాయకత్వంపై కార్మికులకున్న విశ్వాసాన్ని, నిజాయితీని, పోరాట నిబద్ధతను ప్రశ్నించే విధంగా ఈ చర్య ఉందని మండిపడ్డారు. దీన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించమని హెచ్చరించారు. ఇదే సమయంలో గుర్తింపు యూనియన్, ఐఎన్‌టియుసి తమకు ఇష్టానుసారం ప్రకటనలు చేస్తే సహించేది లేదన్నారు. స్టీల్ ఉన్నత యాజమాన్యం తక్షణం స్పందించి తగు చర్యలు చేపట్టాలని, లేకుంటే తీవ్ర పరిణామాలు తప్పదని హెచ్చరించారు. సమావేశంలో స్టీల్ సిఐటియు నాయకులు గంగాధర్, టీవీ కే రాజు, బి ఎన్ మధుసూదన్, భానుమూర్తి, వి ప్రసాద్ పాల్గొన్నారు.

నిషేధం జిఒపై నిరసన

ప్రజాశక్తి తగరపువలస : రాష్ట్రంలో రోడ్లపై సభలు, ర్యాలీలను నిషేధిస్తూ, ప్రభుత్వం జారీ చేసిన జిఒ1కి వ్యతిరేకంగా టిడిపి ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం స్థానిక జంక్షన్‌లో నిరసన చేపట్టారు.. ముందుగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, పార్టీ మండల అధ్యక్షులు డిఎన్ రాజు, 1,2 వార్డుల అధ్యక్షులు టి సూరిబాబు, బడిగింటి నీలకంఠం, నగర కార్యదర్శి పిట్టా సురేష్, వానపల్లి సత్య, తదితరులు మాట్లాడుతూ, రోడ్‌షోలు, ర్యాలీలు నియంత్రిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జిఒను తక్షణమే ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నేతలు పాసి త్రినాథకుమార్, ఎంవి గురుమూర్తి, కొక్కిరి అప్పన్న, గిడుతూరి శ్రీను పాల్గొన్నారు. అనంతరం జిఒ కాపీలను దగ్ధం చేశారు.



జిఒ ప్రతులను దగ్ధం చేస్తున్న టిడిపి నేతలు

సిఐటియు రాష్ట్ర కమిటీకి అభినందన

ప్రజాశక్తి- గాజువాక : భీమవరంలో జరిగిన సిఐటియు 16వ రాష్ట్ర మహాసభల్లో నూతన కమిటీ అధ్యక్షులుగా ఎవి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా సిహెచ్ నరసింగరావు, కోశాధికారిగా కెఆర్‌కె మూర్తి ఏకగ్రీవంగా ఎన్నిక కావడంపై భెల్ సిఐటియు నేతలు హర్షం వ్యక్తం చేసి, వారిని అభినందించారు. నూతన కార్యవర్గం ఆధ్వర్యంలో రాష్ట్రంలో సిఐటియు అభివృద్ధిపథంలో పయనిస్తుందని, కార్మిక కర్షక, బడుగు బలహీనవర్గాల సమస్యలపై పోరాటాలు, ఉద్యమాలను మరింత ముందుకు తీసుకెళ్తారని భెల్ సిఐటియు తరపున ఆకాంక్షించారు. నూతన కమిటీకి అభినందనలు తెలిపిన వారిలో జిటిపి ప్రకాష్, కె.విజయకుమార్, ఎస్ జగన్నాధరావు, కేశ్య, జి చిన్నబాబు, భోగేష్, ఆర్ జనార్ధనరావు ఉన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి -కంచరపాలెం : మెజార్టీ రోడ్డు ప్రమాదాలకు అతి వేగమే కారణమని కంచరపాలెం ట్రాఫిక్ సిఐ మళ్ళ అప్పారావు అన్నారు. రోడ్డు ప్రమాదాలు నివారణ చర్యలలో భాగంగా ప్రజలను చైతన్యపరిచేందుకు కంచరపాలెం బర్మా జంక్షన్, బిర్లా జంక్షన్, ఎన్ఎడి, పాలిటెక్నిక్ కాలేజీ హాస్టల్ ప్రాంతాల్లో దృశ్యశ్రవణ వాహనం ద్వారా ప్రదర్శన నిర్వహించి అవగాహన కల్పించారు. ప్రజలంతా ట్రాఫిక్ నిబంధనలు పాటించి సహకరించాలని సిఐ కోరారు. నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. ట్రాఫిక్ ఎస్ఐలు పాపారావు, అన్వర్ ఉల్ హాక్, కానిస్టేబుల్ శంకర్ పాల్గొన్నారు.

కొత్త పింఛన్ల పంపిణీ

పింఛన్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి

ప్రజాశక్తి - రంపచోడవరం

రంపచోడవరం, మారేడుమిల్లి మండలాలకు సంబంధించిన కొత్త పింఛన్లను బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో పంపిణీ చేశారు. రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ శుభం బన్సల్ పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధనలక్ష్మి మాట్లాడుతూ ఏజెన్సీలోని గడప గడప మన ప్రభుత్వం ద్వారా అనేక సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కర్రి పాపారాయుడు, ఎంపీపీలు బంధం శ్రీదేవి, సార్ల లలిత, కె.ఆనంద్. జడ్పిటిసిలు పండ్ల వెంకటలక్ష్మి, గొర్లె బాలాజీ బాబు, వైస్ ఎంపీపీలు కొమ్మిశెట్టి బాలకృష్ణ, పండ కుమారి, లక్కోండ రవికుమార్, తుంబుడు లతా, ఎంపీడీవోలు ఎంవిఆర్ కుమార్ బాబు, వైవి రమణమూర్తి, తహశీల్దారు పి వెంకటేశ్వరరావు, రంపచోడవరం సర్పంచ్ మంగ బుజ్జయ్య, తదితరులు పాల్గొన్నారు.

7న ఉత్తరాంధ్ర సమస్యలపై చర్చావేదిక

ప్రజాశక్తి- సీతమ్మధార : 'ఉత్తరాంధ్ర సమస్యలు, ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షల' పై ఉత్తరాంధ్ర చర్చావేదిక ఆధ్వర్యంలో ఈ నెల 7న ఉదయం 10గంటలకు విశాఖ దసపల్లా హోటల్‌లో సదస్సు నిర్వహిస్తున్నట్లు ఉత్తరాంధ్ర చర్చావేదిక కోకన్వీనర్ భీశెట్టి బాబ్జీ తెలిపారు. ఈ సదస్సుకు అధికార వైసిపితోసహా అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులను, ఉత్తరాంధ్ర మేధావులను ఆహ్వానించినట్లు తెలిపారు.సదస్సులో ముఖ్య అతిధులుగా లోకసత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ, తెలుగుదేశం పొలిట్‌బ్యూరో సభ్యులు అయ్యన్న పాత్రుడు, జనసేన పొలిటికల్ అఫైర్స్ కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, ఎపిసిసి అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, మాజీ వైస్‌ఛాన్సలర్, ఉత్తరాంధ్ర సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కెస్.చలం తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిని కాంక్షించే ప్రతిఒక్కరూ సదస్సుకు హాజరుకావాలని కోరారు.

శాంతారాం దంపతులను సత్కరిస్తున్న గీతం దంత వైద్యులు

రిటైర్డు గీతం ఉద్యోగికి సత్కారం

ప్రజాశక్తి -మధురవాడ : గీతం దంత వైద్య కళాశాల ఆస్పత్రి ఆధ్వర్యంలో నగరంలో పలు ప్రాంతాలలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాలకు సంచార దంత వైద్యశాల రథసారథిగా 36ఏళ్లు సేవలందించి, ఉద్యోగ విరమణ చేసిన గుత్తుల శాంతారామ్‌ను ఘనంగా సత్కరించారు. బుధవారం నిర్వహించిన వీడ్కోలు సభలో జి.శాంతారామ్ దంపతులను దంత వైద్య కళాశాల వైద్యులు డాక్టర్ రవిశంకర్, డాక్టర్ ప్రభాకర్, ఎంవిపి. రామారావు, దంత వైద్య కళాశాల వైద్యులు, సిబ్బంది, అభినందించారు.